# సాఫ్ట్‌వేర్ ‘ఇతి’హాస్యం [1]

~ అద్దంకి అనంతరామయ్య



**సీరియల్:** సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం [1]

**రచన:** అద్దంకి అనంతరామయ్య

**ప్రచురణ:** కినిగె పత్రిక patrika.kinige.com

**కాలం:** జనవరి 2014

**శాశ్వత లింకు:** http://patrika.kinige.com/?p=957

©Author.

**What can you do with this document?**

Read it!
Store this PDF on your device.
Share the link with your friends
Share this PDF with your friends via personal communication (e.g. email)
Take printouts for personal use

**What is not allowed by Owner of this document?**

Editing the document. No page to be removed or added.
Distributing to public (instead kindly share the link to Kinige given above)

*అత్యధికంగా అమ్ముడుపోయిన ఈ-పుస్తకంగా పేరు తెచ్చుకున్న "రామ్@శృతి.కామ్" రచయిత అద్దంకి అనంతరామయ్య రాసిన రెండవ హాస్య నవల ఈ "సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం". ఇవాళ్టితో ఇది వారం వారం సీరియలైజ్ కానుంది. ఇది మొదటి భాగం.*

# సాఫ్ట్‌వేర్ 'ఇతి'హాస్యం

డెబ్బై వేలు ఖరీదు చేసే కొత్త బండి మీద, డెబ్బై కిలోల బరువు ఉన్న అజయ్ ఆఫీసుకి బయలు దేరాడు. సాదారణంగా అజయ్ కోడి ఆరింటికి కాకుండా పదింటికి కూస్తూ ఉంటుంది. పదకొండు, పన్నెండు గంటల మధ్యలో ఆఫీసుకి రావటం, ఏ అర్ధరాత్రి దాటాకనో ఇంటికి చేరటం అజయ్ కి మామూలే.

అజయ్ , హార్డ్ వర్క్ చేసే సాఫ్ట్ వేర్ ఇంజనీర్. కాలుష్యంతో నిండిన హైదరాబాదులో కల్మషం లేని మనస్సుతో ఉద్యోగం చేస్తున్నాడు. వారంలో ఐదు రోజులు నరకంలో మిగిలిన రెండు రోజులు నిద్రలో గడుపుతూ ఉంటాడు. పనిలోకి దిగితే ప్రపంచం ఏమైపోయినా, పాకిస్తాన్తో క్రికెట్ మ్యాచ్ ఉన్నా, పట్టించుకోనివ్వని పరిస్థితుల్లో పనిచేస్తుంటాడు. ఉదయం పది ఇంటినుంచి రాత్రి పన్నెండు దాక పనిచేయటం పరిపాటి.



మధ్యాహ్నం పన్నెండింటికల్లా తన కార్యాలయానికి చేరాడు. సింహద్వారం దగ్గర ఒక్కొక్క కారుని ఆపి, క్షుణ్ణంగా తనిఖీ చేసి కానీ లోపలికి పంపటం లేదు. అజయ్ తన బండిని ఆపి, తలకున్న శిరస్త్రాణాన్ని తీసి, తన గుర్తింపు బిళ్ళను భద్రతా సిబ్బందికి చూపించి, లోపలికి బండిని పోనిచ్చాడు. ఈ సాఫ్ట్ వేర్ కార్యాలయాల్లో ఉద్యోగులకు ఉన్నంత రక్షణ / భద్రతా, ఉద్యోగాలకు ఉండదనేది సత్యం. దగ్గితే రాలిపోయే పళ్ళు లాంటివి ఈ ఉద్యోగాలన్నీ కూడాను. బండిని తాను రోజు ఉంచే చోటున పెట్టి,

అద్దంలో చూసి, తల దువ్వి, ఒక చేత్తో ల్యాప్ టాప్ బ్యాగ్గుని, ఇంకో చేత్తో శిరస్త్రాణాన్ని పట్టుకొని, కార్యాలయం లిఫ్టు దగ్గరకు వచ్చి నిలబడ్డాడు. ఎనిమిది అంతస్తుల భవనమది. అజయ్ పని చేసేది అన్నింటికన్నా పైన ఉన్న అంతస్తులో. ఆ కారణం చేత అజయ్ తన కింద కొన్ని వందల మంది పని చేస్తుంటారని ఎప్పుడూ ఆనందపడుతూ ఉంటాడు. లిఫ్టు కోసం ఎదురు చూస్తూ ఉన్నాడు.

అప్పటికే అక్కడ అమ్మాయిలు నిలబడి ఉన్నారు. ఇద్దరి చేతుల్లో చిన్న చాటలంత సెల్లు ఫోనులు ఉన్నాయి. ఇంకో చేతిలో గుర్తింపు బిళ్ళలు ఉన్నాయి. జీన్సు ఫ్యాంటు, టీషర్ట్ లో ఇద్దరు అమ్మాయిలూ తళతళలాడి పోతున్నారు. అజయ్ ఇద్దరినీ తేరిపారా చూశాడు. అజయ్ సరిగ్గా చూస్తున్నాడా లేదా అన్నట్టుగా ఆ అమ్మాయిలు కుడా అజయ్ వైపు చూశారు.

“I was very busy when you called me” అన్నది ఒక అమ్మాయి.

“oh sorry, I thought you were free. Where were you?” అడిగింది రెండో అమ్మాయి.

“I was at the theatre with Vimal”

“Oh! How was the movie?”

“Awesome yaar! A must watch movie, Amazing work by the cast & crew”

అంటూ ఇద్దరమ్మాయిలు ముద్దు ముద్దుగా ఇంగ్లీషులో మాట్లాడుతుంటే అజయ్ వింటూ నిలబడ్డాడు. ఈ లోపు లిఫ్ట్ రానే వచ్చింది. అమ్మాయిలిద్దరూ లిఫ్టు లోకి వెళ్ళారు. అజయ్ వాళ్ళని అనుసరించాడు. వాళ్ళు వాడిన పెర్ఫ్యూమ్ వాసన లిఫ్ట్ అంతటా నిండిపోయింది. లిఫ్టు పైకి కదిలింది. అమ్మాయిలు మళ్ళీ మాట్లాడుకోవటం మొదలెట్టారు.

“Where was the theatre?”

"Been to Inorbit mall"

"Great that you guys got the tickets"

"Hmm, today I didn't feel like coming to office, I hate coming to office on monday"

"కదా! నాకు కుడా" అని రెండో అమ్మాయి అనటంతో అజయ్ అవాక్కయ్యాడు. ఆ ఆశ్చర్యంలో ఉండగానే రెండో అమ్మాయి, "అవును మండే చాలా వర్క్ ఉంటుంది" అంటుండగా లిఫ్ట్ వాళ్ళు దిగాల్సిన అంతస్తు రావటంతో, లిఫ్ట్ తెరుచుకుంది. ఇద్దరూ మళ్ళీ ఆంగ్లంలో మాట్లాడుకుంటూ వెళ్ళిపోయారు. ఇందాకటి నుండి ఇద్దరూ ఇంగ్లీషులో ఇరగదీస్తుంటే, ఉత్తరం నుంచి వచ్చిన ఊర్వశులేమో అనుకున్న అజయ్ కి, వాళ్ళిద్దరూ తెలుగు అమ్మాయిలని తెలుసుకొని తేరుకొనే సరికి చాలా సేపే పట్టింది. "ఏంటో ఈ అమ్మాయిలు, మాట్లాడినా కానీ, మనమ్మాయిలో కాదో తెలుసుకోవటం కష్టంగా ఉందని మనస్సులో తిట్టుకున్నాడు అజయ్.

ఎనిమిదో అంతస్తులో ఉన్న భద్రతా అధికారికి తన గుర్తింపు బిళ్ళను మళ్ళీ చూపించాడు. అజయ్ బ్యాగును ఒకటికి రెండుసార్లు తనిఖీ చేసి అజయ్ ని లోపలికి అనుమతించాడు. తెలిసినవాళ్ళంతా "గుడ్ ఆఫ్టర్ నూన్ అజయ్" అంటూ పలకరించారు. అజయ్ కుడా వాళ్లకి తిరిగి "గుడ్ ఆఫ్టర్ నూన్" చెప్తూ ముందుకు కదిలాడు. తను కూర్చుండే చోటికి చేరి, శిరస్త్రాణాన్ని, లాప్ టాప్ ను, తన బల్ల మీద సర్దుతూ ఉండగా, "గుడ్ ఆఫ్టర్ నూన్ అజయ్" అంటూ పలకరించాడు డాలర్ బాబు భరత్. "మనం మధ్యాహ్నం తినే భోజనంలో గుడ్డు ఉంటుంది తప్పితే, మన జీవితాలలో గుడ్డు ఎక్కడుంది డాలర్ బాబు" అని అజయ్ అసహనంతో అనటంతో భరత్ నవ్వి ఊరుకున్నాడు.

అజయ్ తన లాప్ టాపును మొదలుపెట్టే పనిలో ఉండగా తన ప్రక్కన కూర్చునే అమ్మాయి, "హాయ్ అజయ్, గుడ్ ఆఫ్టర్ నూన్" అని నవ్వుతూ పలకరించింది, ప్రియాంక సింగ్, పంజాబీ అమ్మాయి, అందమైనది, తెలివైనది, పెళ్లైనది. వారాంతం బాగానే గడిచిందని తన పనిలోకి

దూరిపోయాడు. ఒక అరగంటకు డాలర్ బాబు వచ్చి, “తిందామా అజయ్” అని డాలర్ బాబు అడిగాడు. ఇద్దరు కలిసి తినటానికి అదే భవంతిలో ఉన్న భోజనశాలకు వెళ్ళారు.

“డాలర్ బాబు” డాక్టర్ ఫ్రీగా చూస్తాడని జబ్బులు తెచ్చుకొనే రకం. పేరులోని డాలర్ ని చూస్తేనే అర్ధం అవ్వాలి, బాబుకి అమెరికా సంయుక్త రాష్ట్రాలతో సంభందం ఉందని. పావుగంట మాట్లాడితే అందులో పది నిముషాలు అమెరికా గురించే మాట్లాడుతుంటాడు. అలా అని చెప్పి మనోడు పుట్టి పెరిగింది అమెరికాలో కాదు. పని మీద వెళ్లి, అమెరికాలో పది వారాల పాటు అక్కడ ఉండి వచ్చాడు. అమెరికా వెళ్ళేదాకా ఒక్కింత బాగానే ఉండేవాడు. వెళ్లి వచ్చాక జనాలు భరించలేనంతగా మారాడు భరత్. ఇప్పుడు కొంత నయం కానీ, అమెరికా నుండి వచ్చిన కొత్తల్లో జనాలకు నరకం చూపించేవాడు.

దోశ ఎంతరా అని అడిగితే డాలరుకి రెండు అని సమాధానం చెప్పేవాడు. దూరాలను కిలోమీటర్లలో గాక మైళ్ళల్లో కొలిచి చెప్పటం, పదే పదే ఇక్కడి వాతావరణాన్ని, కాలుష్యాన్ని, ఇక్కడి మనుషుల్ని తిట్టేవాడు. ఏ మాట చెప్పాలన్నా, ‘ఇదే అమెరికాలో అయితే’ అనో, ‘నేను అమెరికాలో ఉన్నప్పుడు ఒకసారి’ అనో మొదలు పెట్టేవాడు.

ఇద్దరూ భోజనం తీసుకొని, కూర్చొని తినటం మొదలు పెట్టారు. “పచ్చడి చాలా బాగుంది కదా అజయ్” అన్నాడు బాబు. “అమెరికా నుండి తెప్పించిన ఆవకాయట!!” వెటకారం చేశాడు అజయ్. “నన్ను పిలవకుండా వచ్చేశారు, మీ కోసం వెతికి వెతికి వస్తున్నా” అన్నది గీత. అందమైన అమ్మాయి. మాట్లాడుతుంటేనే ముద్దొచేస్తుంది. పేరుకు తగ్గట్టే, వీళ్ళ మేనేజరు గీతను దాటడు, గీత మాటను జమదాటడు. “వడ్డించేవాడు మనవాడైతే, కడ పంక్తిలో కూర్చున్నా వచ్చిన లోటేమీ వుండదన్న విషయాన్ని వంట పట్టించుకున్న గీత, పని చేయటం ఎప్పుడో మానేసింది.. కానీ తనకు కావాల్సిన పనులు చేయించుకోవటంలో మాత్రం దిట్ట. ఈ విషయంలోనే అజయ్ మేనేజర్ తో ఎప్పుడూ గొడవ పడుతూ ఉంటాడు. ప్రతి సారీ మేనేజరు గెలుస్తూ ఉంటాడు, అజయ్ రగిలి పోతూ ఉంటాడు.

“నీ కోసం చూశాను గీత, మేనేజరుతో మాట్లాడుతున్నావు, కదిలించటం ఎందుకులే అని” అన్నాడు డాలర్ బాబు. “అవునవును, ఇద్దరు మాట్లాడుకుంటూ ఉంటే, మధ్యలో వచ్చి డిస్టర్బ్ చేయటం అమెరికాలో కూడా సభ్యత కాదు” అని గీత నవ్వటంతో అజయ్ కి కూడా నవ్వు ఆగలేదు. భోజనం చేసి ఎవరి పనిలో వాళ్ళు మునిగి పోయారు.

ఆ తర్వాత రోజు అజయ్ ని మేనేజరు పిలవటంతో తన గదికి వెళ్ళాడు. అజయ్ ని కూర్చోమని చెప్పాడు. “గీత, రెండు వారాలు సెలవు మీద వెళ్తున్నది. కాబట్టి తన పని కూడా నువ్వే చూసుకోవాల్సి ఉంటుంది” అన్నాడు. “కష్టం సార్! అంత పని చేయటం”, అన్నాడు అజయ్. “కష్టపడాలి అజయ్, ఈ వయస్సులో ఎంత కష్టపడితే అంత మంచిది”, అన్నాడు మేనేజర్. “కుదరదు సార్, ఇప్పటికే చాలా పని పేరుకు పోయి ఉన్నది. తన పని కూడా నేనే చేయటం అసాధ్యం, నా వల్ల కాదు”, అన్నాడు అజయ్. ఈ విషయం మీదనే ఇద్దరికీ మాట, మాట పెరిగింది. “అంత ప్రేమ ఉంటే ఆ పనేదో నువ్వే చేయి” అని చెప్పి విసురుగా బయటికి వచ్చేశాడు అజయ్.

మధ్యాహ్నం మూడు గంటలకు , అజయ్ కాఫీ తీసుకొని కూర్చున్నాడు . తన పైఅధికారితో జరిగిన గొడవతో చిర్రెత్తి పోయి ఉన్నాడు . “ఏమి చేద్దాం అనుకుంటున్నావు ?” అని డాలర్ బాబు అడిగాడు, అజయ్ చేతిలో ఉన్న సిగిరెట్ అందుకుంటూ. “అదే ఆలోచిస్తున్నానురా! వాడు చెప్పినట్లు తల వంచుకుని పని చెయ్యటం నా వల్ల కాదు. నాకొచ్చిన కోపానికి , నరికేద్దామనిపించింది” అని సిగిరిట్ డాలర్ బాబు దగ్గర నుండి తీసుకొని గట్టిగా పీల్చాడు .

“ఈ కంపెనీకి రాజీనామా చేస్తావా ఏంటి కొంపతీసి?”, “కంపెనీకి రాజీనామానా, అస్సలు సాఫ్ట్ వేర్ ఉద్యోగమే మానేయాలి అనుకుంటున్నాను” అన్నాడు అజయ్ , “ మానేసి...” “అదే ఏమి చేయాలో అర్థం కాకనే ఆగిపోయా, లేదంటే ఈ పాటికి ఊర్లో ఉండేవాడిని” అన్నాడు. “అదేంటిరా ? ఈ కంపెనీ కాకపోతే ఇంకొకటి , సాఫ్ట్ వేర్ వద్దంటే ఎలా? వెనుక ఆస్తి ఎంతుందేంటి ?” ,ఆస్తి పెద్దగా లేదు రా,ఏదో ఒకటి చేయకపోతే పిచ్చి ఎక్కేలా ఉంది ! ఇవాళ ఏ వారం?” “బుధవారం”. “ఈ

వీకెండ్ ఇంటికి వెళ్ళాలి, ఇక్కడ మనశ్శాంతి లేదు" అన్నాడు అజయ్. "ఆ వెళ్ళేదేదో ఇవాళ రాత్రికే వెళ్ళు. ఆ మనశ్శాంతి ఏదో రెండు రోజుల ముందే దొరుకుతుంది" అని డాలర్ బాబు చెప్తుండగానే అజయ్ ముఖం కొంచెం వికసించింది. "నిజమేరా ,ఆ ఆలోచనే రాలేదు? అంటూ తన కంప్యూటర్ దగ్గరకు చేరాడు. ఇంటర్నెట్ లో టికెట్ కోసం వెతకసాగాడు.

"ఏ.సి బస్సులో సీట్లు లేవురా" అన్నాడు అజయ్ దిగులుగా. " పుట్టి పెరిగింది ఏ.సి లో నాయే , ఏ.సి లేకపోతే యాక్స్ తో సరిపెట్టు చెమట వాసన రాకుండా, మామూలు బస్సుకు చేయి మాట్లాడకుండా" అన్నాడు డాలర్ బాబు. "నిజమే ! ఏదీ కలిసి రానప్పుడు ఏ.సి ఎందుకులే " అంటూ మామూలు బస్సుకు టికెట్ తీసుకున్నాడు. "అంతా బాగానే ఉంది కానీ ,నువ్వు అడిగితే సెలవు ఇస్తాడంటావా? " అన్నాడు డాలర్ బాబు అనుమానంతో. "వాడిని ఎవడు అడుగుతాడు? రేపు ఉదయం ఫోను చేసి, జలుబనో, జ్వరమనో చెప్తాను" అన్నాడు అజయ్.

*[తరువాయి భాగం వచ్చే వారం]*

For Latest Telugu Books - Visit now:
Kinige.com